# నేలంతా దీపావళే!

డి.వి.ఆర్.భాస్కర్

చిన్నప్పుడు దీపావళి పండగొస్తోందంటే తెగసంబరంగా వుండేది. పదిరోజుల ముందునుంచే ఏమేం కొనుక్కోవాలో లిస్టు రాసుకునేవాళ్లం. 'కాకర పువ్వొత్తులు, సీమటపాకాయలు, తాటాకు టపాసులు, ఉల్లిపాయ బాంబులు, వెన్నముద్దలు, పాంబిళ్లలు, భూ చక్రాలు, విష్ణుచక్రాలు, మతాబులు, చిచ్చుబుడ్లు, కప్పగంతులు, బిళ్లల పిస్తోలు... ఇలా కొండవీటిచాంతాడంత వుండేది మా జాబితా.



స్నేహితులంతా ఒక చోట చేరి దీపావళికి ఏమేం తయారు చెయ్యాలో తెగ ఆలోచిస్తూ రకరకాల ఊహల్లో తేలిపోతుంటే మా అమ్మమ్మ అంటే మా నాన్నగారి మేనత్త మా మధ్యకు ఎప్పుడు వచ్చి చేరేదో కానీ, "ఒరే, బాచీ! పండక్కి పిండివంటలు ఏం చేసుకుందామని" అడిగేది. మా ఇంట్లో చిన్న పిల్లాణ్ణి నేనే. దాంతో, మా తాతయ్యకు, మామ్మకు, బాబాయిలకి, మేనత్తలకి నేనంటే మహా ముద్దు. ఒక్క దీపావళే కాదు, ఏ పండగొచ్చినా సరే, పిండింటలు ఏం చేయాలో మా తాతయ్య నన్నే అడిగేవాడు. నేను కజ్జకాయలనీ, అరిశెలనీ, లడ్డూలనీ, ఇట్లా రకరకాల గొంతెమ్మ కోరికలన్నీ కోరేవాడ్ని. మా అమ్మకి మైసూర్‌పాకంటే మహా ఇష్టం. నాన్నకి గులాబ్ జామంటే మోజు. మా మేనత్తకి రవ్వలడ్డంటే క్రేజు. అందుకే, అందరూ నా దగ్గరకొచ్చి నన్ను మంచి చేసుకుని "ఒరేయ్ బాచీ! పండక్కి ఏం చేయించమంటావని తాతగారడిగితే ఫలానాది కావాలని చెప్పు... అని తమకిష్టమైనది చెప్పేవాళ్లు. నేను ఎవరేది చెప్పినా, "సరేలే బాబాయ్ అనీ, అట్లాగే అత్తా అనీ హామీ ఇచ్చేసేవాణ్ణి" మా తాతయ్యకి నేతి అరిశెలంటే మహా ఇష్టం. అందుకే, నాతో వాటి గురించే తెగ చెప్పి నోరూరించేవాడు. నేను అయిసయిపోయి "అరిశెలు చెయ్యిలే మామ్మా" అనేవాడ్ని.

"తాతా మనవళ్లు ఏకమయ్యారు ఇంక తప్పేదేముందీ, ముందు బియ్యం నానపొయ్యాలిగా" అంటూ తన పనిలో పడేది మామ్మ. అంతా బాగానే వుండేది కానీ, టపాసులు కొనిపెట్టమని అడిగితే మాత్రం తాతయ్య అంత తేలిగ్గా ఒప్పుకునేవాడు కాదు. దీర్ఘోపన్యాసం దంచేసేవాడు. "అది గాత్తాతయ్యా, మరేం" అంటూ ఆయన వెనకాలే తిరుగుతూ తెగ కాకాపట్టేవాణ్ణి. "పండక్కి ఇంకా చాలా రోజులున్నాయిగా అప్పుడు చూద్దాంలే" అని నా నెత్తిమీద ముద్దుగా ఒక మొట్టికాయ వేసేవాడు.

తీరా పండగ టయిముకి "నీకు కావాలంటే కజ్జికాయలు, సున్నుండలు కూడా చేయిస్తా కానీ, ఆ వెధవ టపాసులు

మాత్రం కొనేది లేదు. ఏదో శాస్త్రం ప్రకారం కాల్చాలి కాబట్టి, వెనకవీధి కృష్ణమూర్తి దగ్గర రెండు కిలోల మతాబులు కట్టించుకొస్తా, అవి కాలుద్దువు గానీలే'' అని గుండెల్లో లక్ష్మీఔటు పేల్చేవాడు.

''టపాకాయలు కాల్చటమంటే డబ్బులు కాల్చినట్టే, ఆ డబ్బులు పెడితే ఇంటిల్లిపాదీ సినిమా చూడచ్చు'' అనేవాడు మా నాన్న. ఈ మాటలు విని మా రెండోబాబాయి అక్కడికొచ్చి ''మరే, డొలాస్ నగర్‌లో మంచి సినిమా ఆడుతోందిట'' అని మరి కాస్త అగ్గి రాజేసేవాడు.

దాంతో పండగ రోజు అవి కాలుస్తా, ఇవి కాలుస్తా అని మా స్నేహితులతో బీరాలు పలికిన నాకు మర్నాడు వాళ్లకి మొహం ఎట్లా చూపించాలో తెలీక మా నాన్నగారి మేనత్త పక్కలో దూరి ఆమె మెడను వాటేసుకోని ఏడుస్తూ పడుకునేవాడ్ని. నా ఏడుపు చూసి ఆమెకూడా కళ్లనీళ్లు పెట్టుకునేది. ''బండవెధవలు, ఒక ముద్దూ లేదూ ముచ్చటా లేదు. పండగనాడు పసిపిల్లాణ్ణి ఏడిపిస్తారా, బుద్ధి లేపోతే సరి'' అంటూ మెటికలు విరుస్తూ, నన్ను ఊరుకోబెట్టడానికి నానా తిప్పలూ పడేది. ముఖ్యంగా నరకాసురుడితో సత్యభామ ఎట్లా యుద్ధం చేసిందో, సత్యభామ చేతిలో నరకాసురుడెట్లా చచ్చాడో ఆమె చెబుతుంటే వింటూ ఊకొడుతూ వెక్కిళ్లు పెడుతూనే నిద్రలోకి జారుకునే వాణ్ణి.

నిద్దరలో కూడా టపాసులు కాలుస్తున్నట్టే కలలు కనేవాణ్ణి. కాసేపటికి మా అమ్మమ్మ ''అసుర సంధ్యవేళలో ఏంటిరా వెధవ నిద్దర. ఇంక లేచి టపాకాయలు తెచ్చుకోవా ఏంటి'' అంటూ నస పెట్టేది. ''లేచి ఏం చేయమంటావమ్మమ్మా, నాన్న, తాతయ్య డబ్బులు ఇవ్వనన్నారుగా'' అని ఓసారి కళ్లు తెరిచి మళ్లీ బజ్జునేవాణ్ణి.

''ఏడిశారులే వాళ్లంతే అంటార్లే గానీ, నువ్వు లేచి ఇత్తీసుకుని కోమటి నాగేశ్వర్రావు దగ్గరకెళ్లి, నేంజెప్పానన్జెప్పి మతాబులు, చిచ్చుబుడ్లు తెచ్చుకో'' అంటూ కొంగు ముడి విప్పి ఓ ఇరవై నోటు చేతిలోపెట్టేది. ఆ మాటలతో నా నిద్దరంతా దెబ్బకి ఎగిరిపోయేది. వెంటనే ఆమె చేతిలో నుంచి ఆ నోటు లాక్కుని ఆమె మెడలు వంచి బుగ్గల మీద గట్టిగా ముద్దుపెట్టి తూనీగలా పరిగెత్తుతుంటే ''ఒరేయ్! జాగర్తా, మీ నాన్నకి చూపించబాకు. అది కూడా తీసుకోని సిగిరెట్లు ఊదుతాడు''అని హెచ్చరికలు చేసేది.

ఎవరికంటా పడకండా ఎట్లా వెళ్లాలా అని ఆలోచిస్తూ, నక్కుతూ నక్కుతూ వెళ్తుంటే వాకిట్లోనే ఎదురయ్యేవాడు మా తాతయ్య. ఆయనకెట్లా మస్కాకొట్టాలా అని ఆలోచిస్తుండగానే ఆయనే నా దగ్గరకొచ్చి, ''పిచ్చిసన్యాసీ పొద్దునేదో అడిగావుగా, సుబ్బారావు కొట్టుకెళ్లి నే చెప్పానని చెప్పి, నీక్కావలసిన టపాసులు తెచ్చుకో ఫో'' అనేవాడు. నాగేశ్వర్రావు కొట్టుకు వెళ్లేప్పటికి అక్కడ నాకన్నా ముందే మా నాన్న కూచుని వుండేవాడు. సీమటపాకాయలు, లక్ష్మి ఔట్లు, వంకాయ బాంబులు కొని వాటికి ఎంతయిందో లెక్కకట్టి, పద్దులో రాసుకోమని నాగేశ్వర్రావు పెళ్లాంతో చెబుతూ వుండేవాడు. అప్పటిదాకా కళకళలాడిపోయిన లక్ష్మిమొహం పద్దనేసరికి నల్లగా పెట్టి నసపెడుతూనే టపాకాయలన్నిట్నీ జీళ్లు ఖాళీ చేసిన తగరపు సంచిలో పోసి నా చేతికే ఇచ్చేది. నాకు మా నాన్నను చూస్తే చచ్చే భయం. దాంతో, ఆయన కంటబడకుండా మెల్లిగా అక్కణ్ణించి జారుకునేవాణ్ణి.

తీరా సాయంత్రమయ్యేసరికి ''ఒరేయ్ బాచీ, ఈ మందు సామాన్లు తీసుకుని పైమీడమీదకెళ్లి జాగర్తగా కాల్చుకో ఫో'' అంటూ మా బాబాయి నా చేతికో సంచి ఇచ్చేవాడు. దాన్నిండా అవ్వాయ్ చువ్వాయ్‌లు, వెన్నముద్దలు, పెన్సిళ్లు, నేలటపాకాయలూ వుండేవి. సంచీని చొక్కా కింద సంచి దాచుకోని వాకిట్లో కెళ్లేసరికి ''మా తాతిమ్మన్నాడ''ంటూ కృష్ణమూర్తి మనవడు ఒక బేసిన్నిండా మతాబాలు, చిచ్చుబుడ్లు తెచ్చిచ్చేవాడు.

మా తాతయ్యకో అక్కయ్య వుండేది. ఆవిడకు మడి, ఆచారాలు చాలా ఎక్కువ. నేను మాత్రం ఆవిడ ఆరేసుకున్న మడిధోవతిని కావాలనే తీగ మీదనుంచి కిందపడేసి ''అమ్మమ్మా! నీ ధోతీ కింద పడిందంటూ తెచ్చి ఆమె మీదకు విసిరేసేవాణ్ణి. ''వెధవా! మైలపడేసావు కదరా'' అని గొణుగుతూనే ముసుగు సవరించుకుంటూ నా దగ్గర కొచ్చి బుగ్గలు పుణికి ''ఇదిగోరా అబ్బీ, ఈ డబ్బుతో నీక్కావలసినన్ని టపాకాయలు కొనుక్కుని మా ఇంట్లో కూచ్చోని కాల్చుకో ఫో'', అని పదిరూపాయల నోటిచ్చేది.

ఇట్లా ఒకళ్లకి తెలీకుండా ఒకళ్లు కొనిచ్చిన టపాసులతో మా ఇల్లంతా నిండిపోయేది. వాటిని ఎవరికంటా పడకుండా దాచటం పెద్ద సమస్యయ్యేది. ఊళ్లో అందరూ తొమ్మిదిగంటలకల్లా టపాకాయలు కాల్చటం అయిపోతే, నేను మాత్రం తీరిగ్గా అప్పుడు మొదలుపెట్టేవాణ్ణి. తాతయ్య ''మందు సామాను కొనగానే సరికాదు, వాటిని కాల్చేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలి. లేకపోతే అదిగో, ఆ ఆదిత్య గాడికిలాగే నీక్కూడా నాలుక్కళ్లవుతాయి'' అని హెచ్చరించేవాడు. ''ఆదిచ్చ బాబాయికి ఏమయింది తాతయ్యా?'' అని అడిగేవాణ్ణి. ఏమయ్యేదేముందీ?'' అంటూ మా బాబాయి తన చిన్నప్పుడు టపాకాయలు తెచ్చి ఎండబెట్టటం, వాటిమీద కుంపట్లోంచి నిప్పురవ్వ ఎగిరొచ్చి పడడం, సరిగ్గా అదే సమయానికి టపాసులు ఎండాయో లేదో చూద్దామని వాటిమీదకు ఒంగిన మా బాబాయి కళ్లల్లో అవన్నీ ఢమా ఢమా పేలి, వాటిలోని మందంతా పడటం, చావు తప్పి కన్నులొట్టబోయినట్టు సోడాబుడ్డి కళ్లద్దాలు రావడం ......'' ఇదంతా పెద్ద పురాణంలాగా చెప్పేవాడు. అంతా చెప్పి ఇంతకీ ''బాచిగాడికి టపాకాయలు కొనిచ్చిందెవరు?'' అని ఏమీ ఎరగనట్టు అడిగేవాడు మా తాతయ్య. ''ఏమో, నాకేం తెలుసూ?'' అని సాగదీసేది అమ్మమ్మ. తాతయ్యతో చెప్పద్దన్నట్టుగా కళ్లతోనే సైగ చేసేవాడు బాబాయి. చివరకందరూ తేలుకుట్టిన దొంగల్లాగా గప్‌చిప్‌గా వూరుకునేవారు. మొత్తమ్మీద మా మిత్ర బృందంలో అందరికీ టపాకాయలు కాల్చటం రెండ్రోజులకే అయిపోతే, నాకు మాత్రం నెల్రోజుల పాటు రోజంతా దీపావళే!!

